

## కానిస్టేబుల్ మైపాల్ కుటుంబానికి రూ.4.21 లక్షల ఆర్థిక సాయం

- రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి అండగా

02




# సంగారెడ్డి మెదక్

శనివారం 12 సెప్టెంబర్ 2026 www. praja jyothi news.com పేజీలు:09


# బీఆర్ఎస్ అరాచకానికి ప్రజలే బుద్ధి చెబుతారు

- దళితులను అవమానిస్తే భారీ మూల్యం తప్పదు
- బీఆర్ఎస్ అరాచకంపై సంగారెడ్డి లో కాంగ్రెస్ శ్రేణుల నిరసన కార్యక్రమం లో డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి :**

అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వ్యవహరించిన తీరును నిరసిస్తూ సంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు సంగారెడ్డి పట్టణంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. రామ్‌నగర్‌లోని జగ్గారెడ్డి నివాసం నుంచి పాతబస్టాండ్‌లోని అంబేద్కర్ చౌరస్తా వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి నిర్మలా జగ్గారెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అరాచకం, గూండాయిజానికి పాల్పడ్డారని ఆరోపించారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై మాట్లాడాల్సిన ప్రజాప్రతినిధులు అందుకు భిన్నంగా వ్యవహరించడం దారుణమన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇలాంటి ఘటనలు ఎక్కడా జరగలేదని విమర్శించారు.

☞ మిగతా 2 లో









# బీఆర్ఎస్ అరాచకానికి ప్రజలే బుద్ధి చెబుతారు

మొదటిపేజీ తరువాయి

బీఆర్ఎస్ నేతలు తమకు తామే నెట్టుకుని, పోలీసులపై దాడి చేసి, తిరిగి తామే బాధితులమన్నట్లుగా వ్యవహరించడం సిగ్గుచేటని అన్నారు. దళిత వర్గాన్ని అవమానించేలా బీఆర్ఎస్ నేతలు చేసిన వ్యాఖ్యలు, చర్యలను రాష్ట్ర ప్రజలంతా గమనించారని పేర్కొన్నారు.దళితులు నడిచిన నేలను పసుపు నీళ్లతో శుద్ధి చేయడం




బీఆర్ఎస్ పార్టీ కుసంస్కారానికి, అనాగరిక చర్యలకు నిదర్శనమని నిర్మలా జగ్గారెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్న తీరును జీర్ణించుకోలేకే బీఆర్ఎస్ నేతలు అరాచకాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.దళితులను అవమానించే విధంగా వ్యవహరిస్తున్న బీఆర్ఎస్ పార్టీ ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోక తప్పదని, ఇందుకు భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని నిర్మలా జగ్గారెడ్డి హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, మున్సిపల్ చైర్మెన్ కూన వనితా సంతోష్,సిడిసి ఛైర్మెన్ రామ్ రెడ్డి, నాయకులు జార్జ్ ,కిరణ్ గౌడ్, సంతోష్ , శ్రీకాంత్ , రామ్ చందర్ నాయక్ , శ్రీకాంత్ రెడ్డి, సందీప్ రెడ్డి,భూమేష్, తదితరులు పాల్గొన్నారు.



# కానిస్టేబుల్ మైపాల్ కుటుంబానికి రూ.4.21 లక్షల ఆర్థిక సాయం

మొదటిపేజీ తరువాయి




**శివ్వంపేట ప్రజాజ్యోతి సెప్టెంబర్ 11:**

శివ్వంపేట మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మైపాల్ కుటుంబానికి పోలీసు అధికారులు,బ్యాచ్‌మేట్స్ అండగా నిలిచారు.ఈ సందర్భంగా ఎస్పీ ఆధ్వర్యంలో మైపాల్ బ్యాచ్‌మేట్స్,ఇతర పోలీసు అధికారులు కలిసి రూ.3,21,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు.అదేవిధంగా శివ్వంపేట పోలీస్‌స్టేషన్ సిబ్బంది తరపున రూ.1,00,000 అందజేశారు.దీంతో మొత్తం రూ.4,21,000 నగదును మైపాల్ కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్,తూప్రాన్ సీఐ వెంకటరాజు గౌడ్,శివ్వంపేట ఎస్సై మధుకర్ రెడ్డితో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.మైపాల్ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని అధికారులు తెలిపారు.

# రైతన్నకు చేదోడు ఎడ్లకు ఘన సత్కారం..

## - అందంగా ముస్తాబైన ఎడ్లు.. గ్రామాల్లో పోలాల అమావాస్య సందడి

## - కల్హేర్ మండలంలో ఘనంగా పోలాల అమావాస్య వేడుకలు



**కల్హేర్, సెప్టెంబర్ 11 (ప్రజాజ్యోతి):.**

కల్హేర్ మండలంలోని పలు గ్రామాల్లో పోలాల అమావాస్య వేడుకలను రైతులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం కల్హేర్‌తో పాటు. మార్డి , ఫతేపూర్, ఇంద్రానగర్, బీబీపేట తదితర గ్రామాల్లో రైతులు తమకు వ్యవసాయంలో చేదోడువాదోడుగా నిలిచే ఎడ్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.ఎడ్లకు వివిధ రంగులతో అలంకరణలు చేసి, భాజాభజంత్రీల నడుమ గ్రామంలోని చౌడేశ్వరి, వీర హనుమాన్ తదితర ఆలయాల చుట్టూ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేసి, పంటలు సమృద్ధిగా పండాలని, పశుసంపద ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మొక్కులు చెల్లించుకున్నారు. పోలాల అమావాస్య పండుగను ప్రధానంగా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో నిర్వహిస్తారు. సరిహద్దు ప్రాంతం కావడంతో నారాయణఖేడ్, మనూర్, కంగ్టి, సిర్గాపూర్, కల్హేర్ మండలంలోని పలు గ్రామాల్లోనూ ఈ పండుగ ప్రభావం కనిపిస్తూ రైతులు సంప్రదాయబద్ధంగా వేడుకలు నిర్వహిస్తున్నారు.

# చలో అసెంబ్లీకి ముందే లంబాడీ నాయకుల అరెస్టు

## - హక్కుల సాధన కోసం పిలుపు.. తూప్రాన్‌లో పోలీసుల ముందస్తు చర్యలు

## - లంబాడి ఐక్యవేదిక మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్ నాయక్,




**తూప్రాన్ (ప్రజాజ్యోతి) సెప్టెంబర్ 11:**

లంబాడీల హక్కుల కోసం చేపట్టనున్న చలో అసెంబ్లీ కార్యక్రమం నేపథ్యంలో తూప్రాన్ పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉన్న లంబాడీ నాయకులను శుక్రవారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు.గిరిజన విద్యార్థి సంఘం ఇచ్చిన పిలుపు మేరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న చలో అసెంబ్లీ కార్యక్రమంలో లంబాడీల ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు లంబాడి ఐక్యవేదిక మెదక్ జిల్లా అధ్యక్షుడు నాలుగో వార్డ్ కౌన్సిలర్ జైపాల్ నాయక్, నాయకులు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా పోలీసులు ముందస్తు అరెస్టులు చేపట్టారు.సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ మందిరాన్ని అడవుల్లో కాకుండా హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను విడుదల చేయాలని, గిరిజన విద్యార్థుల స్కాలర్‌షిప్‌లపై అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్లతో చలో అసెంబ్లీకి పిలుపునిచ్చినట్లు నాయకులు తెలిపారు.ముందస్తు అరెస్టుల్లో తూప్రాన్ మున్సిపల్ నాలుగో వార్డు కౌన్సిలర్, లంబాడీ ఐక్యవేదిక మెదక్ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ జైపాల్ నాయక్, దిగావత్ శివ నాయక్ తదితరులు ఉన్నారు.

# హైదరాబాద్ జూలాజికల్ పార్క్ యాత్ర

**మెదక్ (ప్రజా జ్యోతి)**

క్స్‌పోజర్ విజిట్ మెదక్ జిల్లాలోని ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. రాజు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్క్‌కు ఎక్స్‌పోజర్ విజిట్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో 63 మంది సిడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థులు, 63 మంది తల్లిదండ్రులు, 18 మంది ఐ ఈ ఆర్ పి ఎస్ , 13 మంది కేర్‌గివర్లు, 4 మంది విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. మొత్తం 148 మంది మూడు బస్సుల్లో హైదరాబాద్‌కు వెళ్లారు.ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. రాజు మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఇంటి పరిసరాలకే పరిమితం కాకుండా బయట ప్రపంచాన్ని కూడా చూడాల్సిన అవసరం ఉందని తెలిపారు.ఇలాంటి ఎక్స్‌పోజర్ విజిట్ల ద్వారా పిల్లల్లోని భయం, సంకోచం తగ్గి ఆత్మవిశ్వాసం పెరుగుతుందని చెప్పారు. కొత్త ప్రదేశాలను సందర్శించడం, ఇతర వ్యక్తులను కలవడం ద్వారా వారి సామాజిక నైపుణ్యాలు, ఇతర సామర్థ్యాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. తద్వారా భవిష్యత్తులో పిల్లలు మరింత ధైర్యంగా ముందుకు సాగేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ కె. రాజు, ఐపిఆర్పిఎస్ కేర్‌గివర్లు, విద్యాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.








# గర్భిణీలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

## - పోషణ మాసంలో గర్భిణీలకు అవగాహన.

**శివ్వంపేట ప్రజాజ్యోతి సెప్టెంబర్ 11:**

పోషణ మాసాన్ని పురస్కరించుకుని శివ్వంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణీలకు పోషకాహారం, ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ సాయి సౌమ్య పాల్గొని గర్భిణీలకు పలు ఆరోగ్య సూచనలు చేశారు.ప్రతిరోజూ తీసుకునే ఆహారంలో పోషక విలువలు కలిగిన పదార్థాలను చేర్చుకోవాలని సూచించారు. అందుబాటులో ఉండే ఆకుకూరలు, కూరగాయలను విరివిగా తీసుకోవడంతో పాటు చిరుధాన్యాలను కూడా ఆహారంలో భాగంగా చేసుకోవాలని తెలిపారు.ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాట్లాడుతూ గర్భిణీలు ప్రతిరోజూ అంగన్‌వాడీ కేంద్రాలకు హాజరై ఆరోగ్యలక్ష్మి భోజనాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.గర్భధారణ దశ నుంచే సరైన పోషకాహారం తీసుకోవడంతో పాటు ఆరోగ్య సూచనలు పాటించడం ద్వారా ఆరోగ్యవంతమైన కుటుంబాలు,సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది,అంగన్‌వాడీ టీచర్లు,గర్భిణీలు పాల్గొన్నారు.



# కోతుల బెడద నియంత్రణకు పటిష్ట చర్యలు

## - ప్రజలు, రైతులకు ఉపశమనం కల్పించేందుకు ఉద్యమంలా కార్యాచరణ

## - నాలుగు మున్సిపాలిటీల్లో సుమారు 6,500 కోతులు ఉన్నట్లు అంచనా



**మెదక్ (ప్రజాజ్యోతి)**

కోతుల బెడద నుంచి ప్రజలు, రైతులకు ఉపశమనం కల్పించే దిశగా మున్సిపల్ కమిషనర్లు పటిష్ట చర్యలు చేపట్టాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయం నుంచి నర్సాపూర్, తూప్రాన్, మెదక్, రామాయంపేట మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ గూగుల్ మీట్ ద్వారా సమీక్ష నిర్వహించారు. గత సమావేశంలో కోతుల బెడద నివారణకు సూచించిన అంశాలపై ఇప్పటివరకు తీసుకున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ల నివేదికల ప్రకారం మెదక్‌లో సుమారు 3,000 కోతులు, నర్సాపూర్‌లో 2,000, తూప్రాన్‌లో 1,000, రామాయంపేటలో 500 కోతులు ఉన్నట్లు అంచనా వేశారు. నాలుగు మున్సిపాలిటీల్లో కలిపి సుమారు 6,500 కోతులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కోతుల బెడదను నియంత్రించేందుకు యుద్ధ ప్రాతిపదికన కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టాలని కలెక్టర్ సూచించారు. కోతులను పట్టుకుని నిర్మల్ జిల్లాకు తరలించి, అవసరమైన ఆపరేషన్ అనంతరం అక్కడే వదిలే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కోతుల నియంత్రణ కార్యక్రమాన్ని దశలవారీగా, పకడ్బందీగా అమలు చేస్తే జిల్లాలో సమస్యను గణనీయంగా నియంత్రించవచ్చని కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు. ఇందుకు అన్ని వర్గాల సహకారం అవసరమని తెలిపారు. ప్రజలు, రైతులకు ఉపశమనం కల్పిస్తూ మెదక్ జిల్లాను కోతుల నియంత్రణలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ నగేష్, డీఎఫ్ఓ జోజి, డీపీఓ యాదయ్య, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.



# పావన్నపేట మండలశీలో బిజెపిలో చేరికలు





**మెదక్ (ప్రజాజ్యోతి)**

పావన్నపేట మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు బిజెపి పార్టీలో చేరడం జరిగింది. హైదరాబాద్‌లోని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు నివాసంలో జరిగిన కార్యక్రమంలో మెదక్ జిల్లా కాంగ్రెస్ మోర్చా అధ్యక్షుడు బైండ్ల సత్యనారాయణ ముదిరాజ్, బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్లాస్ రాధామల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీలో చేరారు. పావన్నపేట మండలంలోని సీతానగర్ గ్రామ కాంగ్రెస్ వార్డు సభ్యులతో పాటు నగ్సాన్ పల్లి అరికెల గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీలో చేరినట్లు తెలిపారు. పార్టీలో చేరిన వారికి బీజేపీ కండువాలు కప్పి నాయకులు సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలు, బీజేపీ నాయకత్వంపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని అన్నారు. రాబోయే రోజుల్లో పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు బికొండ రాములు నాయకులు ఆకుల సుధాకర్ తలారి దుర్గయ్య బీజేవైఎం నాయకులు నార్సింగ్ ఉపసర్పంచ్ శ్రీ రామ్ నరేష్ కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రన్న బీజేవైఎం జిల్లా నాయకులు సతీష్ కుమార్ మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు సిద్ధిరాములు పాపన్నపేట పట్టణ అధ్యక్షుడు సుంకారి కృష్ణయ్య జిల్లా మైనార్టీ మోచ కమిటీ ప్రధాన కార్యదర్శి బుల్లెట్ మండల మాజీ జనరల్ సెక్రటరీ దుర్గాప్రసాద్ పార్టీ సీనియర్ నాయకులు వెంకట్ సాయి బాబా రామ్ చందర్ నాగరాజు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజన్న ఫౌండేషన్ ద్వారా గర్భిణీ స్త్రీలకు ఉచిత పోషకాహార కిట్ల పంపిణీ,,

**శివ్వంపేట ప్రజాజ్యోతి సెప్టెంబర్ 11:**

శివ్వంపేట మండల కేంద్రంలో నేడు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజన్న ఫౌండేషన్ ద్వారా గర్భిణీ స్త్రీలకు ఉచిత పోషకాహార కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పులిమామిడి నవీన్ గుప్తా తెలిపారు. ఉదయం 10 గంటలకు నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో రాజన్న ఫౌండేషన్ ద్వారా గర్భిణీ స్త్రీలకు ఉచిత పోషకాహార కిట్ల పంపిణీ చేస్తామని తెలిపారు, అనంతరం భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) విధానాలను ఎస్సీ,ఎస్టీల పట్ల ఆ పార్టీ వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ కార్యక్రమానికి ఆవుల రాజిరెడ్డి హాజరుకానున్నారు అన్ని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ నాయకులు,మహిళా కాంగ్రెస్ నాయకులు,అనుబంధ సంఘాల నాయకులు,కార్యకర్తలు సకాలంలో హాజరై ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని లోని నవీన్ గుప్తా కోరారు.



## ఘనంగా ఇంటిగ్రేటెడ్ పాస్టర్ అసోసియేషన్ 8వ వార్షికోత్సవం

- మల్కాపూర్‌లో దేవునికి మహిమకరంగా స్తుతి కూడిక..

- నూతన కమిటీ ఎన్నిక..

**కొండాపూర్ ప్రజా జ్యోతి**

సంగారెడ్డి జిల్లా ఇంటిగ్రేటెడ్ పాస్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 8వ వార్షికోత్సవ స్తుతి కూడిక గురువారం కొండాపూర్ మండలం మల్కాపూర్ గ్రామంలోని సీసీడీఎల్ మినిస్ట్రీలో ఘనంగా, దేవునికి మహిమకరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లు, క్రైస్తవ సోదరులు, సోదరీమణులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు, స్తుతి ఆరాధనలు నిర్వహించారు.అనంతరం ఇంటిగ్రేటెడ్ పాస్టర్ అసోసియేషన్ సంగారెడ్డి జిల్లా నూతన కమిటీ కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీగా అధ్యక్షులుగా పాస్టర్ పి. భాస్కర్, ఉపాధ్యక్షులుగా పాస్టర్ ఎం. జోసెఫ్, కార్యదర్శిగా పాస్టర్ బి. ఏలియా కుమార్, ఉప కార్యదర్శిగా పాస్టర్ టి. అనిల్, కోశాధికారిగా పాస్టర్ ఎ. ప్రసన్న కుమార్ ఎన్నికయ్యారు.ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా పాస్టర్ సిహెచ్. షద్రక్, పాస్టర్ జి. కిషన్లను ఎన్నుకున్నారు. సలహాదారులుగా పాస్టర్ జి. దావీదు, పాస్టర్ సి. డానియల్, పాస్టర్ జి .సునీల్లను నియమించారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు పలువురు పాస్టర్లు, క్రైస్తవ సంఘాల ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. సంఘ బలోపేతానికి, క్రైస్తవుల ఆధ్యాత్మిక అభివృద్ధికి నూతన కమిటీ సమిష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు.



## ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం బి సురేష్ యం. ఈ. ఓ

**కల్హేర్, సెప్టెంబర్ 11 (ప్రజాజ్యోతి):**

మండల విద్యాశాఖ కల్హేర్ ఆధ్వర్యంలో మండలంలోని 13 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి ఘనంగా సన్మానించారు. కల్హేర్ మండల వనరుల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి అభినందించారు.మండల విద్యాధికారి బి. సురేశ్ ఒక ప్రకటనలో ఈ విషయాన్ని తెలిపారు. కార్యక్రమానికి కల్హేర్ ఎంపీడీవో హరి నందన్ రావు ముఖ్య అతిథిగా హాజరై ఉత్తమ ఉపాధ్యాయులను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు గోవర్ధన్, వంశీకృష్ణ, వినయ్, కృష్ణకుమారి, సంతోష్ కుమార్, కాంప్లెక్స్ హెచ్ఎం సంజీవ్ కుమార్. పలువురు మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





# జిల్లాలో కాడాస్ట్రల్ రీ-సర్వే పనులకు వేగం

**- అత్యంత నిష్పక్షపాతంగా సర్వే పూర్తి చేయాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్**






**మెదక్ (ప్రజాజ్యోతి)**

జిల్లాలో జరుగుతున్న కాడాస్ట్రల్ రీ-సర్వే పనులను నిర్దేశిత కాలవ్యవధిలో అత్యంత ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మెదక్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కాడాస్ట్రల్ రీ-సర్వే నిర్వహణ పురోగతిని అదనపు కలెక్టర్ నాగేష్, డీఆర్డీఓ అంబదాస్‌రాజేశ్వర్, ఏడీ ల్యాండ్ సర్వే కిషన్, ఆర్డీవోలు మెదక్ రమాదేవి, నర్సాపూర్ రామకృష్ణ, తూప్రాన్ బావయ్య తదితరులతో సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మెదక్ జిల్లాలోని 10 వేల గ్రామాల్లో 13,000 ఎకరాల భూములకు రీ-సర్వే ప్రక్రియ పూర్తికావాలని తెలిపారు. రీ-సర్వే ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడంతో పాటు భూహద్దుల విషయంలో ఎలాంటి వివాదాలకు తావులేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.అలాగే సర్వే బృందాలు రోజువారీగా నిర్వహిస్తున్న పనితీరును, ప్రతి బృందం పురోగతిని, ప్రతిరోజు పూర్తి చేస్తున్న విస్తీర్ణాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించి నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించాలన్నారు.కాడాస్ట్రల్ రీ-సర్వే కార్యక్రమం భూ రికార్డుల శాశ్వత ప్రామాణికతకు ఎంతో కీలకమని పేర్కొన్న కలెక్టర్.. పారదర్శకంగా, పకడ్బందీగా సర్వే నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నిమజ్జనానికి తూప్రాన్ రెడీ.. ఏర్పాట్లపై అధికారుల ఫోకస్

**పెద్దచెరువులో నిమజ్జన స్థలాన్ని పరిశీలించిన ఆర్డీఓ, డీఎస్పీ**





**తూప్రాన్ (ప్రజాజ్యోతి), సెప్టెంబర్ 11:**

వినాయక నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు తూప్రాన్‌లో అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలను వేగవంతం చేస్తున్నారు.ప్లాన్ ఆఫ్ యాక్షన్‌లో భాగంగా తూప్రాన్ పెద్దచెరువులో ఏర్పాటు చేయనున్న నిమజ్జన ప్రాంతాన్ని ఆర్డీఓ బావయ్య, డీఎస్పీ నరేందర్ గౌడ్, సీఐ వెంకట రాజు గౌడ్, ఎంఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డితో పాటు మున్సిపల్, సంబంధిత శాఖల అధికారులు పరిశీలించారు.ఈ సందర్భంగా నిమజ్జనానికి వచ్చే విగ్రహాల తరలింపు, వాహనాల రాకపోకలు, ట్రాఫిక్ నియంత్రణ, పోలీసు బందోబస్తు, భక్తులకు అవసరమైన సౌకర్యాలు తదితర అంశాలపై అధికారులు దృష్టి సారించారు. నిమజ్జన ప్రాంతంలో చేపట్టాల్సిన పనులను గుర్తించి, కార్యక్రమానికి ముందే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.వినాయక ఉత్సవాల్లో చివరి ఘట్టమైన నిమజ్జనం ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సజావుగా సాగేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులు సూచించారు. భక్తుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ, నిమజ్జనాన్ని ప్రశాంతంగా పూర్తి చేసేలా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు.

# విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దే శిల్పులకు ఘన సత్కారం

## - మండల విద్యాధికారి బుచ్చయ్య నాయక్, ప్రధానోపాధ్యాయులు బి సాంబయ్య







**వెల్దుర్తి (ప్రజాజ్యోతి) సెప్టెంబర్ 11:**

మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారి బుచ్చయ్య నాయక్ ఆధ్వర్యంలో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుచ్చయ్య నాయక్ మాట్లాడుతూ, విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించడమే ఉపాధ్యాయుల బాధ్యత కాదని, వారి వ్యక్తిత్వ వికాసానికి, భవిష్యత్ నిర్మాణానికి మార్గదర్శకులుగా నిలవడం కూడా గురువుల బాధ్యతేనని అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో ఆత్మీయంగా మెలుగుతూ, వారి సమస్యలను అర్థం చేసుకుని ప్రోత్సహిస్తే వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. గురువు చెప్పే ఒక్క మంచి మాట విద్యార్థి జీవితాన్ని మార్చగలదు, గురువు చూపే ఒక్క మంచి దారి భవిష్యత్తుకు పునాది అవుతుంది. విద్యార్థుల విజయమే ఉపాధ్యాయుల అసలైన గౌరవమని పేర్కొన్నారు. అనంతరం రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన బి సాంబయ్యను మండల కేంద్రంలోని ఉపాధ్యాయుల సమక్షంలో ఘనంగా సన్మానించారు. మరియు జిల్లా,మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి మున్సిపాలిటీలో ఉచితంగా మట్టి గణపతుల పంపిణీ పర్యావరణహితంగా వినాయక చవితి జరుపుకోవాలని చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్ పిలుపు











**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:**

సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో వినాయక చవితి పండుగ సందర్భంగా పర్యావరణహిత వేడుకలకు మున్సిపల్ యంత్రాంగం పిలుపునిచ్చింది. ఈ రోజు సంగారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా సంగారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో ఉచితంగా మట్టి గణపతులను పంపిణీ చేశారు. పట్టణ ప్రజలందరూ రసాయన విగ్రహాలకు దూరంగా ఉంటూ, మట్టి గణపతులను మాత్రమే ప్రతిష్ఠించి పూజించాలని చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్ కోరారు. మట్టి విగ్రహాల వినియోగం వల్ల పర్యావరణానికి మేలు జరగడమే కాకుండా, నిమజ్జనం సమయంలో చెరువులలోని జలచరాలకు ఎలాంటి హానీ కలగదని ఆమె పేర్కొన్నారు. అనంతరం మున్సిపల్ కమీషనర్ మాట్లాడుతూ... పట్టణ ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో వినాయక చవితిని జరుపుకోవాలని ఆకాంక్షించారు. పండుగ సందర్భంగా నిర్వహించే అన్నదాన కార్యక్రమాల్లో ప్లాస్టిక్ ప్లేట్లను పూర్తిగా నివారించి, వాటి స్థానంలో ఇస్తరాకులు లేదా స్టీల్ ప్లేట్లను మాత్రమే ఉపయోగించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ విజయలక్ష్మితో పాటు మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలకు అధికారులు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు.

# మునిపల్లి మండల కేంద్రానికి పంచాయతీరాజ్ సబ్ డివిజన్ కార్యాలయం మంజూరు.

**మునిపల్లి సెప్టెంబర్ 11 (ప్రజాజ్యోతి):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖ సబ్ డివిజన్ కార్యాలయాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా మునిపల్లి మండల కేంద్రంలో పంచాయతీరాజ్ సబ్ డివిజన్ పి ఆర్ ఎస్ డి కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. గతంలో పంచాయతీరాజ్ సబ్ డివిజన్ ప్రధాన కార్యాలయం పుల్కల్లో ఉండగా, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక చొరవతో ఈ కార్యాలయాన్ని మునిపల్లి మండల కేంద్రానికి మార్చడం జరిగింది. ఇకపై మునిపల్లి మరియు రాయికోడ్ మండలాల ప్రజలు పంచాయతీరాజ్ సబ్ డివిజన్‌కు సంబంధించిన పనుల కోసం మునిపల్లి మండల కేంద్రంలోని పి ఆర్ ఎస్ డి కార్యాలయాన్ని సంప్రదించవచ్చు. ఈ నిర్ణయంతో మునిపల్లి, రాయికోడ్ మండలాల ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ కానున్నాయి. మునిపల్లి మరియు రాయికోడ్ ప్రజల తరపున గౌరవ మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ కి ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదాలు.

# 1855 ఏళ్ల బీసీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ

## ఈ నెల 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి



**సంగారెడ్డి ప్రజా జ్యోతి సెప్టెంబర్ 11:--**

జిల్లాలోని బీసీ మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రోత్సాహం అందించేందుకు ఇంటింటికి ఇందిరమ్మ కుట్టు మిషన్ల పంపిణీ పథకం కింద ఉచిత కుట్టు మిషన్ల పంపిణీకి అర్హులైన మహిళలు సెప్టెంబర్ 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన మహిళలు ష్ట్రిజు:7/స్త్రశీఎఎం.ఎస్త్రస్త్ర.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకొనుటకు ఈ నెల 15 చివరి తేదీ అని తెలిపారు. దరఖాస్తుదారుల వయస్సు 18 నుండి 55 సంవత్సరాల లోపు ఉండాలని, నిరుద్యోగ మహిళలు, నిరుపేదలు, నిరాధారణకు గురైన వితంతు, ఒంటరి, వికలాంగులు, అనాథ మహిళలకు, టైలరింగ్ ట్రైనింగ్ సర్టిఫికెట్ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. నివాసం, కులం, ఆదాయం, ఆధార్, విద్యార్హత, టైలరింగ్ శిక్షణకు సంబంధించిన ధ్రువపత్రాలు, తెల్ల రేషన్ కార్డ్ లేదా ఆహార భద్రత కార్డు కలిగి ఉండాలని, కనీస అక్షరాస్యత తప్పనిసరి అని, ఎక్కువ దరఖాస్తులు వస్తే కనీస విద్యార్హత ఐదవ తరగతి పాసైన వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. కుటుంబంలో ఒకరికి మాత్రమే అవకాశం ఉంటుందని, కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణులకు 1.50 లక్షలు, పట్టణ వాసులకు రెండు లక్షల లోపు ఉన్నవారు అర్హులని తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో బీసీ స్వయం ఉపాధి పథకం కింద ఆర్థిక లబ్ధి పొందిన వారు అర్హులు కాదని స్పష్టం చేశారు. దరఖాస్తుదారులు దరఖాస్తులను సంబంధిత వెబ్సైట్ నుండి డౌన్లోడ్ చేసుకుని కుల, ఆదాయ, నివాస, ఆధార్ కార్డు, రేషన్ కార్డ్, విద్యార్హతలు, టైలరింగ్ శిక్షణ, అనుభవం తదితర ధ్రువీకరణ పత్రాలతో గ్రామీణులు సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారికి, పట్టణ ప్రాంతవాసులు సంబంధిత మున్సిపల్ కమిషనర్లకు ఈ నెల 15లోగా దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ సూచించారు.

# పంటల యాజమాన్యంపై రైతులకు అవగాహన

## వరి, పత్తి పంటల్లో సమగ్ర యాజమాన్య పద్ధతులపై శిక్షణ మరియు క్షేత్ర ప్రదర్శనలు




**వట్పల్లి.ప్రజా జ్యోతి సెప్టెంబర్ 11**

సంగారెడ్డి జిల్లావట్‌పల్లి మండల్. గౌతపూర్ గ్రామంలోరైతులు పంటల్లో అధిక దిగుబడులు సాధించడంతో పాటు పెట్టుబడి ఖర్చులను తగ్గించుకునేందుకు శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను పాటించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. వట్‌పల్లి మండలం గౌతాపూర్ గ్రామంలో ఏ.టీ.ఎం ఏ ఆధ్వర్యంలో నేడు రైతులకు ప్రస్తుత పంటలైన వరి, పత్తి తదితర పంటల యాజమాన్య పద్ధతులపై శిక్షణతో పాటు క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వరి పంటలో పి. ఎస్. బి . వినియోగం వల్ల భాస్వరం మొక్కలకు అందుబాటులోకి వచ్చి పంట ఎదుగుదల, దిగుబడిపై కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. లి అలాగే శనగ పంటలో ట్రైకోడెర్మా. వినియోగం, విత్తన శుద్ధి ద్వారా నేల ద్వారా సంక్రమించే తెగుళ్లను నియంత్రించడంలో దాని ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. లి అదేవిధంగా ప్రస్తుతం జరుగుతున్న డి .సి . ఎస్డిజిటల్ క్రాప్ సర్వేలో పంటల నమోదు ప్రక్రియపై రైతులకు వివరించారు. రైతులు తమ పంటల వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని, పంటల నమోదు ద్వారా ప్రభుత్వ పథకాలు మరియు వ్యవసాయ సేవలు మరింత సమర్థవంతంగా అందే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏ. టి. ఎం. ఏ చైర్మన్ కచూర్ రావు గారు, ఏ. డి. ఏ శ్రీనివాస్ ప్రసాద్ గారు, ఏ.వో శ్రీనివాస్ రెడ్డి గారు, ఏ.ఈ ఓ. పరిమళ, ఏ.టీ.ఎం రమేష్ తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లో భూములు కోల్పోయిన రైతులకు ఎకరానికి 30 లక్షలు ఇవ్వాలని సర్పంచ్ డిమాండ్.




**మునిపల్లి సెప్టెంబర్ 11 (ప్రజాజ్యోతి):**

సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం లోని లింగంపల్లి గ్రామంలో దళితుల భూముల పరిహారం కోసం గ్రామస్తులు గ్రామపంచాయతీ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. సర్వే నెంబర్ 108 లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ కోసం గత ప్రభుత్వం హయాంలో సుమారు 165 ఎకరాల భూమిని సేకరించగా 73 మంది లబ్ధిదారులకు పరిహారం చెల్లించామని, మరో 95 మంది డబ్బులు చెల్లించలేదని గ్రామస్తులు తెలిపారు. భూములు కోల్పోయిన 95 మంది రైతులకు ఎకరానికి 30 లక్షల చొప్పున పరిహారం కట్టుబాటుకు ఒకరికి ఉద్యోగం, 200 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, ఈ సమస్య పరిష్కారం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. డిమాండ్ పరిష్కారం కాకపోతే మండల ఎమ్మార్వో జిల్లా ఆర్డీవో కలెక్టర్ కార్యాలయాలలో నిరసన కార్యక్రమాలు రైతులతో కలిసి న్యాయం జరిగే వరకు ధర్నాలు చేస్తామని గ్రామ సర్పంచ్ ఇమాన్ తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

- యూనిఫామ్, షూ, బెల్ట్ పంపిణీ కార్యక్రమంలో - వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి మరియు

- మునిపల్లి గ్రామ సర్పంచ్ రాజగోని సౌందర్య నరేందర్ గౌడ్,

- మండల విద్యాధికారి భీమ్ సింగ్ పాల్గొన్నారు.





**మునిపల్లి సెప్టెంబర్ 11 (ప్రజాజ్యోతి):**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ, విద్యా సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని వక్తలు సూచించారు.స్థానిక మునిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ప్రభుత్వం అందించిన యూనిఫామ్, షూ మరియు బెల్ట్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మంతూర్ సుధాకర్ రెడ్డి,గ్రామ సర్పంచ్ రాజగోని సౌందర్య నరేందర్ గౌడ్, మండల విద్యాధికారి భీమ్ సింగ్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు మాధవి,ాూ్రాజ చైర్మన్ రాములమ్మ, =శీశీవ్ శీ =ఘుస ప్రతినిధి సంధ్య హాజరయ్యారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, విద్యార్థుల విద్యాభివృద్ధి, ఆరోగ్యం, పాఠశాల హాజరు మరియు సమగ్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అనేక సౌకర్యాలను అందిస్తోందన్నారు. ఉచిత యూనిఫామ్, షూ, బెల్ట్, అల్పాహారం, ఉచిత విద్య, ఉచిత విద్యుత్, ప్రీ–ప్రైమరీ పాఠశాలలు, ఉచిత మధ్యాహ్న భోజనం,విద్యార్థుల కి అవసరమైన ఫర్నిచర్, వంటి సదుపాయాలు ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు మెరుగుపడుతున్న నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు.అలాగే పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థుల విద్యాభివృద్ధిపై చూపుతున్న శ్రద్ధను వక్తలు అభినందించారు. ఉపాధ్యాయుల సమిష్టి కృషితో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరుగుతుండటం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మధురిమ మాట్లాడుతూ గ్రామపెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు సహకారం మరియు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయల కారణంగా ఈ విద్యాసంవత్సరం కొత్తగా 50 అడ్మిషన్లు రావడం చాలా సంతోషంగా ఉందని తమపై నమ్మకంతో పాఠశాలలో చేరిన ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యని అందిస్తామని తమకి సహకరిస్తున్న గ్రామ పెద్దలందరికి ధన్యవాదాలు తెలిపారు.అనంతరం రూమ్ టు రీడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సంధ్య మాట్లాడుతూ అంతర్జాతీయ అక్షంరాస్యత దినోత్సవం ను పురస్కరించుకుని దేశంలోని ప్రతి బిడ్డ చదవాలి – ప్రతి బిడ్డ ఎదగాలి అనే సందేశంతో రీడ్–ఎ–థాన్ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు పుస్తక పఠనం గురించి విద్యార్థులకి అవగాహన కల్పించి విద్యార్థులలో పఠన నైపుణ్యాలను పెంచేందుకి కృషి చేస్తున్నామని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పిల్లలతో కలిసి పఠన కార్యక్రమంలో పాల్గొని ఇంటి వద్ద పిల్లలు పుస్తకాలు చదివేలా ప్రోత్సహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి భీమ్ సింగ్,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి,గ్రామ సర్పంచ్ రాజగోని సౌందర్య నరేందర్ గౌడ్,కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు మాధవి,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రాములమ్మ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మధురిమ,ఇతర ఉపాధ్యాయులు కవిత,అరుణ కుమారి,చంద్రమౌళి, బుష్రా ,రూం టు రీడ్ సంస్థ ప్రతినిధి సంధ్య , గ్రామస్థులు విద్యార్థులు పాల్గొన్నారు.

# కంకోల్ ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహం ఏ ఎస్ సి డి ఓ తనికి









**మునిపల్లి సెప్టెంబర్ 11 (ప్రజాజ్యోతి):**

ఎస్ సి డి ఓ నారాయణఖేడ్ సందర్శించి హాస్టల్‌లో పరిసరాలను మరియు, వంటగదినీ, పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి విద్యాభ్యాసం, వసతి సౌకర్యాల గురించి వివరాలు తెలుసుకున్నారు.విద్యార్థుల సౌకర్యార్థం ట్రంక్ బాక్సులు, బెడ్లు, బెడ్‌షీట్లు, కార్పెట్లు, ప్లేట్లు, గ్లాసులు అందించడం జరిగింది. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తూ, వారి సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోంది.అదేవిధంగా విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన మరియు పరిశుభ్రమైన భోజనం అందించడం జరుగుతోంది.ఈ సందర్భంగా హాస్టల్ సంక్షేమ అధికారి మాట్లాడుతూ, విద్యార్థులు హాస్టల్‌లో అందుతున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని, క్రమశిక్షణతో మరియు పట్టుదలతో చదువుకోవాలని సూచించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని, బాగా చదువుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# ఘనంగా ఎస్‌జీఎఫ్ క్రీడల ముగింపు

## క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్యానికి ఎంతో దోహదం:ఎంఈఓ నర్సింహులు





**రాయికోడ్ సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి):**

మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) క్రీడా పోటీలు శుక్రవారం ఘనంగా ముగిశాయి.ఈ నెల 10, 11 తేదీల్లో రాయికోడ్‌లోని రాధాకృష్ణ మెమోరియల్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన ఈ పోటీల్లో మండలంలోని వివిధ ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.అండర్14,అండర్17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో,వాలీబాల్ తదితర క్రీడా పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు.ఈ సందర్భంగా మండల విద్యాధికారి నర్సింహులు మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని అన్నారు.విద్యార్థుల మానసిక ఆరోగ్యంతో పాటు శారీరక దారుఢ్యానికి క్రీడలు ఎంతో అవసరమని పేర్కొన్నారు.మండలంలోని అన్ని పాఠశాలల్లో క్రీడలను మరింత ప్రోత్సహించాలని సూచించారు.క్రీడా పోటీల నిర్వహణకు సహకరించిన రాధాకృష్ణ మెమోరియల్ పాఠశాల కరస్పాండెంట్ పాండుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.జెడ్పీహెచ్ఎస్ రాయికోడ్ ప్రధానోపాధ్యాయులు నగేష్, జెడ్పీహెచ్ఎస్ హస్నాబాద్ ప్రధానోపాధ్యాయులు శాంతయ్య, రాధాకృష్ణ పాఠశాల కరస్పాండెంట్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.క్రీడల విజయవంతమైన నిర్వహణకు సహకరించిన మండలంలోని అన్ని పాఠశాలల పీడీలు,పీఈటీలు,ఉపాధ్యాయులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం వివిధ క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు పతకాలు,జ్ఞాపికలను అందజేశారు.కార్యక్రమంలో పీడీ జ్యోతి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు విజయకుమార్, నాగరాజ్, ప్రకాశ్‌రావు, గోపాల్, ఉమారాణి, యాదవులు, సతీష్, యాదయ్యతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల పీఈటీలు పాల్గొన్నారు.

# చందా సేకరణ నుంచి 11 రోజుల పూజ వరకు..
# నిమజ్జనం వరకు ప్రతి అడుగులోనూ యువతకు ఒక జీవిత పాఠం

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:**

వినాయక చవితి అంటే కేవలం గణనాథుడి ప్రతిమను ప్రతిష్ఠించి పూజలు చేయడం మాత్రమే కాదు..

యువతను ఒకే వేదికపైకి తీసుకువచ్చి.. ఐక్యత, బాధ్యత, క్రమశిక్షణ, సేవాభావం, పెద్దల పట్ల గౌరవం వంటి విలువలను నేర్పించే ఒక సామాజిక పండుగ.ఒక ప్రాంతంలోని యువకులు ఒక టీంగా ఏర్పడతారు.

ఇంటింటికీ వెళ్లి చందాలు సేకరిస్తారు.ఈ చందా సేకరణలోనే ఒక గొప్ప జీవిత పాఠం దాగి ఉంది.నలుగురిని కలిసి మాట్లాడటం.. ప్రతి ఒక్కరి సహకారం తీసుకోవడం.. వచ్చిన డబ్బును సక్రమంగా వినియోగించడం.. లెక్కలు నిర్వహించడం.. అందరికీ సమాధానం చెప్పడం..ఇవన్నీ రేపు యువకుడు తన కుటుంబ బాధ్యతలను నిర్వహించేటప్పుడు ఎంతో ఉపయోగపడే లక్షణాలే.

### ఒక టీం.. రేపటి కుటుంబానికి పాఠశాల

యువకులు ఒక టీంగా ఏర్పడినప్పుడు ప్రతి ఒక్కరికీ ఒక బాధ్యత ఉంటుంది.ఎవరో పూజా కార్యక్రమాలు చూసుకుంటారు..

ఎవరో ఆర్థిక వ్యవహారాలు చూసుకుంటారు..

మరికొందరు భక్తులకు ఏర్పాట్లు చేస్తారు..

ఇంకొందరు పరిశుభ్రత, అన్నదానం, నిమజ్జనం వంటి కార్యక్రమాలను సమన్వయం చేస్తారు.

ఇక్కడే యువతకు "కలిసి ఉంటేనే కుటుంబం.. కలిసి పనిచేస్తేనే సమాజం" అనే విషయం అర్థమవుతుంది.

రేపు ఉమ్మడి కుటుంబంలో పెద్దలు, తల్లిదండ్రులు, అన్నదమ్ములు, పిల్లలతో కలిసి ఎలా ఉండాలి?

ఎవరి బాధ్యతలు వారు ఎలా నిర్వర్తించాలి?

పెద్దవారి మాటను ఎలా గౌరవించాలి?

చిన్నవారిని ఎలా కలుపుకుని వెళ్లాలి?

ఈ 11 రోజుల గణేష్ ఉత్సవం యువతకు ఇవన్నీ ప్రత్యక్షంగా నేర్పించే ఒక అనుభవంగా మారుతుంది.

11 రోజుల పూజ.. భక్తితో పాటు క్రమశిక్షణ

11 రోజుల పాటు ప్రతిరోజూ పూజలు నిర్వహించడం అంటే ఒకరోజు ఉత్సాహం కాదు.. 11 రోజుల క్రమశిక్షణ.

ప్రతిరోజూ సమయానికి కార్యక్రమాలు నిర్వహించడం..

పెద్దలను ఆహ్వానించడం..

పిల్లలను భాగస్వామ్యం చేయడం..

భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయడం..

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం..

### ఇవన్నీ యువతలో బాధ్యతను పెంచుతాయి.

భక్తి మనసును మంచివైపు నడిపిస్తే.. బాధ్యత మనిషిని మంచి పౌరుడిగా తీర్చిదిద్దుతుంది.పెద్దలతో కలిసి నడవడం.. సంప్రదాయాలను తర్వాతి తరానికి అందించడంగణేష్ ఉత్సవాల్లో పెద్దలు ఇచ్చే సూచనలను యువత పాటించడం కూడా మన సంస్కృతిలోని ఒక విలువను గుర్తుచేస్తుంది.

పెద్దల అనుభవాన్ని గౌరవించడం..

వారి సలహాలను స్వీకరించడం..

చిన్నవారిని ప్రేమగా ముందుకు తీసుకెళ్లడం..

### ఇదే కుటుంబ వ్యవస్థకు పునాది.

ఈ విధంగా చూస్తే.. గణేష్ ఉత్సవం ఒక యువకుడికి భవిష్యత్తులో కుటుంబాన్ని ఎలా నడిపించాలో నేర్పించే ఒక చిన్న సామాజిక పాఠశాల.---

### గణేష్ ఉత్సవాలకు మరో చారిత్రక కోణం

స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో లోకమాన్య బాల గంగాధర్ తిలక్ గణేష్ ఉత్సవాలకు సామాజిక, ప్రజా ప్రాధాన్యతను తీసుకువచ్చారు.

బ్రిటిష్ పాలనలో ప్రజలు పెద్ద సంఖ్యలో ఒకచోట చేరడంపై ఆంక్షలు ఉండగా.. గణేష్ ఉత్సవాలను సామూహికంగా నిర్వహించడం ద్వారా ప్రజలను ఒక వేదికపైకి తీసుకురావడానికి తిలక్ ప్రయత్నించారు.

గణేష్ ఉత్సవాలు క్రమంగా సామాజిక ఐక్యత, ప్రజా చైతన్యం, జాతీయ భావనను పెంపొందించే వేదికగా మారాయి.అప్పటి యువతలో ఐక్యతను పెంచి.. స్వదేశం కోసం ఆలోచించేలా చేయడంలో ఈ సామూహిక ఉత్సవాలు ఒక పాత్ర పోషించాయి.అందుకే నేటి గణేష్ ఉత్సవాల్లో కూడా ఐక్యత, క్రమశిక్షణ, సేవ, దేశభక్తి, సామాజిక బాధ్యత వంటి విలువలను యువత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది.

### నాటి తిలక్ లక్ష్యం.. నేటి యువత బాధ్యత

నాడు గణేష్ ఉత్సవాలు ప్రజలను ఒకచోటికి తీసుకువచ్చి జాతీయ చైతన్యానికి వేదికగా నిలిచాయి.నేడు అదే ఉత్సవాలు యువతను ఒకచోటికి తీసుకువచ్చి..సమాజం కోసం పనిచేయడానికి.. కుటుంబ విలువలను కాపాడడానికి.. మన సంస్కృతి, సంప్రదాయాలను తరువాతి తరాలకు అందించడానికి.. దేశం పట్ల బాధ్యత కలిగిన పౌరులుగా ఎదగడానికి స్ఫూర్తినివ్వాలి.

### నిమజ్జనం.. ముగింపు కాదు.. మరో సందేశం



11 రోజుల పూజల అనంతరం గణనాథుడి నిమజ్జనం జరుగుతుంది. వేడుక ముగిసిపోతున్నప్పటికీ.. ఈ ఉత్సవం యువతకు నేర్పిన పాఠాలు మాత్రం కొనసాగాలి.

ఐక్యత కొనసాగాలి..

కుటుంబ విలువలు కొనసాగాలి..

పెద్దల పట్ల గౌరవం కొనసాగాలి..

సేవాభావం కొనసాగాలి..

సనాతన సంప్రదాయాల పట్ల గౌరవం కొనసాగాలి..

దేశభక్తి కొనసాగాలి.

అదే నిజమైన గణేష్ ఉత్సవ స్ఫూర్తి.

గణపతి ఉత్సవం.. ఒక విగ్రహ ప్రతిష్ఠ కాదు.. ఒక తరం నిర్మాణం!

యువత కలిస్తే ఉత్సవం..

యువత బాధ్యత తీసుకుంటే సమాజం..

సంస్కృతిని యువత ముందుకు తీసుకెళ్తే భవిష్యత్ తరాలకు మన వారసత్వం..

వినాయకుడి ఆశీస్సులతో..

ఐక్యతగా ముందుకు సాగుదాం..

సనాతన విలువలను కాపాడుదాం..

కుటుంబాలను బలోపేతం చేద్దాం..

దేశభక్తిని పెంపొందిద్దాం.

లిలిగణపతి బప్పా మోరియా..

మంగళమూర్తి మోరియా!లిలి